

అసలు నేను రావాలా? వొద్దా?

అమితాబ్‌కు అభిమానుల నుంచి తీపి హెచ్చరికలు జారీ అయ్యాయి. దానికి కారణం ఏంటనుకుంటున్నారా? మన ఇండియా టీమ్ వరల్డ్‌కప్‌లో అప్రతిహత విజయాలతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. బుధవారం జరిగిన సెమీ ఫైనల్‌లో న్యూజిలాండ్‌ని మట్టి కరిపించి ఫైనల్‌కు చేరింది భారత్ జట్టు. ఈ నెల 19న ఆస్ట్రేలియాతో ఫైనల్‌లో తలపడనుంది మన భారత్. ఈ మ్యాచ్ గురించి అమితాబ్ ప్రస్తావిస్తూ.. 'నేను మ్యాచ్ చూడకపోతే ఇండియా కచ్చితంగా గెలుస్తుంది..' అంటూ తన ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ చేశారు. అంతే ఆయనకు స్వీట్ వార్నింగ్‌లు మొదలయ్యాయి. ఒక నెటిజన్ 'మీరు ఫైనల్ మ్యాచ్‌కు రావొద్దు..' అని పోస్ట్ పెట్టాడు. మరొకతను 'మీరు ఇంట్లో టీవీలో కూడా మ్యాచ్ చూడొద్దు' అంటూ అభ్యర్థించాడు. ఇంకో అభిమాని 'అసలు ఆ రోజు మీరు ఇంట్లోనుంచి బయటకు రాకుండా ఉండేందుకు, మీ ఇంటి గేట్‌కి తాళం వేయటానికి మేం సన్నాహాలు చేస్తున్నాం' అంటూ పోస్ట్ పెట్టాడు. ఇవన్నీ చూశాక 'అసలు నేను మ్యాచ్‌కి రావాలా? వొద్దా? అని నిజంగానే ఆలోచిస్తున్నా' అంటూ సరదాగా మరో పోస్ట్ పెట్టారు బిగ్‌బీ. దేశం విషయానికొచ్చేసరికి అంతపెద్ద సూపర్‌స్టార్‌కి కూడా సొంత అభిమానుల నుంచే వార్నింగులు తప్పలేదు.

కమల్‌హాసన్

ఆ పాత్రకు ఎలాంటి ముగింపునిచ్చాడో..

'కల్కీ' సినిమాలో ప్రభాస్ హీరో.. కమల్‌హాసన్ విలన్. సినిమాల్లో హీరో చేతిలో విలన్ దెబ్బలు తినడం సర్వసాధారణం. మరి కమల్‌ని ప్రభాస్ కొడతాడా? నిజంగా తెరపై అది జరిగితే సగటు ప్రేక్షకుడు ఆ సన్నివేశాన్ని తీసుకోగలుగుతాడా? పైగా కమల్‌హాసన్ దేశవ్యాప్తంగా అభిమానులున్న సూపర్‌స్టార్. కొన్నేళ్ల విరామానంతరం ఆయన 'విక్రమ్'తో హిట్ కొడితే అది నాలుగు వందల కోట్లు వసూలు చేసింది. అది కమల్ కెపాసిటీ. నేటికీ హీరోగా ఆయన ఇమేజ్ ఇసుమంత కూడా తగ్గలేదు. ఆ మాటకొస్తే ప్రభాస్ కూడా కమల్‌హాసన్ అభిమానే. ఆ విషయాన్ని పలు సందర్భాల్లో చెప్పాడు కూడా. అలాంటప్పుడు ఈ కథలో విలన్‌ని హీరో ఎలా ఎదుర్కొంటాడు? దర్శకుడు నాగ్‌అశ్విన్ వీరిద్దరి మధ్య సన్నివేశాలు ఎలా డిజైన్ చేశాడు? ఇది దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులను వెంటాడుతున్న ప్రశ్న. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియనప్పటికీ, కమల్ పాత్ర చిత్రణ ఎలా ఉంటుందనే విషయం మాత్రం చూచాయగా తెలుస్తున్నది. ఇందులో కమల్‌ది అత్యంత శక్తిమంతుడైన క్రూరుడి పాత్ర అని తెలుస్తున్నది. మరి ఈ పాత్రకు దర్శకుడు నాగ్‌అశ్విన్ ఎలాంటి ముగింపునిస్తాడో అనేది తెరపైనే చూడాలి. ఏదిఏమైనా 'కల్కీ' సినిమా మాత్రం అంచనాలకు అందే సినిమా కాదని ఫిలిం వర్గాల సమాచారం.

బాలకృష్ణ

మల్టీస్టారర్‌గా తొలి పాన్‌ఇండియా సినిమా

నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ రవీంద్ర(బాబీ) కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రానికి సంబంధించి అద్భుతమైన అప్‌డేట్ ఒకటి రీసెంట్‌గా వెలుగుచూసింది. ఈ సినిమా మల్టీస్టారర్‌గా రూపొందనుందనేది తాజా సమాచారం. మల్టీస్టారర్ సినిమాలు తీయడంలో బాబీ సిద్ధహస్తుడు. ఆయన తీసిన 'వెంకీమామ' మల్టీస్టార్టర్. అందులో వెంకటేశ్, నాగచైతన్య కలిసి నటించారు. బాబీ రీసెంట్ హిట్ 'వాల్తేరువీరయ్య' కూడా మల్టీస్టారర్. అందులో చిరంజీవి, రవితేజ కలిసి నటించారు. ప్రస్తుతం చేస్తున్న బాలయ్య సినిమా కూడా మల్టీస్టారర్ అనేది అత్యంత విశ్వసనీయ సమాచారం. దుల్కర్‌సల్మాన్ ఇందులో కీలక పాత్ర పోషించనున్నాడని తెలిసింది. 1980 ప్రాంతంలో జరిగే కథ ఇదని, ఇందులో దుల్కర్ పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, బాలకృష్ణ పాత్ర అత్యంత శక్తిమంతంగా ఉంటుందని తెలుస్తున్నది. ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంగీత దర్శకుడు ఎవరు? అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. బాబీ సినిమా అంటే దేవిశ్రీప్రసాద్ కామన్. కానీ బాలయ్యకు గత మూడు విజయాలకూ తమనే సంగీత దర్శకుడు. మరి బాలయ్య సెంటిమెంట్ ప్రకారం తమన్‌ని తీసుకుంటారా? లేక బాబీ సెంటిమెంట్‌ని గౌరవిస్తూ దేవిశ్రీనే ఫైనల్ చేస్తారా? అనేది తెలియాల్సివుంది. అనిరుధ్ కోసం కూడా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. బాలయ్య నటిస్తున్న తొలి పాన్ ఇండియా సినిమా ఇదే కావడం విశేషం.



శర్వానంద్

వచ్చే ఏడాది మూడు సినిమాలు

గత ఏడాది డిసెంబర్‌లో శర్వానంద్ నటించిన 'ఒకే ఒక జీవితం' సినిమా విడుదలైంది. ఆ తర్వాత ఇప్పటివరకూ శర్వా సినిమాలేదు. కథల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకోవడమే ఈ విరామానికి కారణమని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో నటిస్తున్నాడు శర్వా. ఈ సినిమా తర్వాత బ్లాక్‌బాస్టర్ 'సామజవరగమనా' దర్శకుడు రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నాడు. ఆ తర్వాత 'లూజర్' వెబ్‌సిరీస్ డైరెక్ట్ చేసిన అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో సినిమా ఉంటుంది. వచ్చే ఏడాది శర్వా నటించిన మూడు సినిమాలు విడుదల అవుతాయని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

మెహరీన్

ఆయన సలహా పాటిస్తా..

'కృష్ణగాడి వీరప్రేమగాథ' సినిమాలో మెహరీన్‌ను చూసిన అందరూ కాజల్ చెల్లెలా? అనే అనుమానం వ్యక్తం చేశారు. బొద్దుగా, ముద్దుగా ఆ సినిమాలో చాలా అందంగా కనిపించింది మెహరీన్. ఆ తర్వాత ఏమైందో.. బొద్దుగా ఉంటే అవకాశాలు రావని ఎవరైనా చెప్పారేమో తెలియదు కానీ.. ఉన్నట్టుండి తగ్గిపోయి సన్నగా తయారైంది. ఓ దశలో జీరో సైజ్‌కి మారిపోయింది కూడా. నిజానికి బొద్దుగా ఉన్నప్పుడున్న అందం సన్నబడ్డాక కనిపించడంలేదని చాలామంది అభిప్రాయపడ్డారు. ఇక రీసెంట్‌గా విడుదలైన 'స్పార్క్ లైఫ్' సినిమాలో మెహరీన్ అటు బొద్దుగా కాకుండా, ఇటు సన్నగా లేకుండా మధ్యస్థంగా ముద్దుగా కనిపించింది. ఇటీవలే ఆమె దర్శకుడు మారుతిని కలిసింది. మెహరీన్‌ను చూసిన మారుతీ.. 'ఇప్పుడు చాలా బావున్నావు. నా 'మంచిరోజులు వచ్చాయి' సినిమాలో చాలా సన్నగా ఉన్నావు. ఇదే మెయింటెయిన్ చెయ్' అన్నాడట. మారుతీ సలహాని పాటిస్తానని, ఇకనుంచి ఇదే లుక్‌ని మెయింటెయిన్ చేస్తానని అభిమానులకు మాట ఇచ్చేసింది మెహరీన్.

మూల విరాట్, ప్రభాకర్ జైనీ, నరసింహప్ప, ఆర్.నారాయణమూర్తి, మామిడి హరికృష్ణ

స్ఫూర్తిదాయకం కాళోజీ జీవితం

జైనీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. మూలవిరాట్, పద్మరాజ్ కుమార్, స్వప్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో విజయలక్ష్మి జైనీ నిర్మించారు. త్వరలో విడుదల కానుంది. ఈ చిత్ర టీజర్, ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి నటుడు, దర్శకనిర్మాత ఆర్.నారాయణ మూర్తి, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, దర్శకులు వి.ఎన్.ఆదిత్య, వేణు ఊడుగుల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ.. 'కాళోజీ తెలంగాణ కోసం జీవించారు. ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం' అన్నారు. దర్శకుడు ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ 'క్వాలిటీ విషయంలో ఏమాత్రం రాజీపడకుండా సినిమాను తెరకెక్కించాం. ఈ సినిమాలో పునరుజ్జీవం చెందుతున్న.. ఓ సజీవ చైతన్యంతో తొణికిసలాడుతున్న సమాజాన్ని చూపించాము' అని చెప్పారు. తెలంగాణ పోరాట యోధుడు ప్రజాకవి కాళోజీ జీవిత చరిత్రను వెండితెర దృశ్యమానం చేసిన దర్శకుడు ప్రభాకర్ జైనీ అభినందనీయుడని మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: యస్.యస్.ఆత్రేయ, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ప్రభాకర్ జైనీ.

అవేవీ నన్ను బాధించలేవు

'రణబీర్‌కి లిప్‌స్టిక్ నచ్చదు. నేను వేసుకుంటే కూడా ఊరుకోడు. తీసేయ్‌మని గొడవ చేస్తాడు. ఆ విషయాన్నే ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. దానికి పెడార్థాలు తీస్తూ రణబీర్ నన్ను వేధిస్తున్నాడని ఏవేవో రాసేశారు. నిజానికి రణబీర్ చాలామంచి మనిషి. నన్ను చాలా బాగా చూసుకుంటాడు. నాపై రాసినా నేను బాధపడను. అవి నన్ను బాధించలేవుకూడా. కానీ తనపై రాశారు. అప్పుడు మాత్రం బాధ అనిపించింది' అని అలియాభట్ ఆవేదన వ్యక్తం చేసింది. ఇటీవల ఆమె కరణ్‌జోహార్ టాక్‌షో 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో కరీనాకపూర్‌తో కలిసి పాల్గొన్నది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ–'చేతిలో ఫోన్ ఉన్న ప్రతివాడూ ప్రస్తుతం జర్నలిస్టే. రూమర్లు పుట్టిస్తూనే ఉంటారు. నేను సన్నగా మారటానికి, నా చర్మాన్ని తెల్లగా మార్చుకోటానికి కొన్ని సర్జరీలు చేయించుకున్నానంట. ఆమధ్య ఈ వార్త సోషల్‌మీడియాలో బాగా ట్రోల్ అయింది. ఇలాంటివి చదువుతూ రణబీర్, నేనూ ఇంట్లో మంచి టైంపాస్ చేస్తుంటాం. నిజంగా వాళ్లకు థ్యాంక్స్ చెప్పాలి' అంటూ చెప్పుకొచ్చింది అలియాభట్.

వరలక్ష్మీ శరత్‌కుమార్

అలాంటి సీన్ చేయలేదు!

'తమిళంలో నేను పోలీస్ క్యారెక్టర్స్ చాలా చేశాను. కానీ తెలుగులో మాత్రం ఇదే మొదటిసారి. నా దృష్టిలో కథే హీరో. ఈ సినిమాలో పాత్రపరంగా చాలా కొత్తగా కనిపించే ప్రయత్నం చేశా' అని చెప్పింది వరలక్ష్మీ శరత్‌కుమార్. ఆమె ఓ కీలక పాత్రలో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ జంటగా నటించిన ఈ చిత్రానికి తేజ మార్ని దర్శకుడు. ఈ నెల 24న విడుదలకానుంది. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను, శ్రీకాంత్ పోలీస్ ఆఫీసర్స్ పాత్రల్లో కనిపిస్తాం. ఇద్దరిలో ఒకరు క్రిమినల్ అయితే ఎలా ఉంటుంది? రాజకీయ ఒత్తిళ్లు ఎలా ఉంటాయి? అనే అంశాలు ఆసక్తికరంగా ఉంటాయి. మలయాళ 'నాయట్టు'కి రీమేక్ అయినా తెలుగులో చాలా మార్పులు చేశారు. ఈ సినిమాలో స్మోకింగ్ చేయడం కాస్త ఇబ్బందిగా అనిపించింది. ఇప్పటివరకు ఏ సినిమాలో అలాంటి సీన్స్ చేయలేదు. పాత్రపరంగా కంపల్సరీ కాబట్టి చేయాల్సి వచ్చింది. లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతో పాటు క్యారెక్టర్ నచ్చితే ఏ జోనర్ కథలోనైనా నటించడానికి సిద్ధంగా ఉన్నా' అన్నారు.

చేనాగ్, సుచిత్ర, చంద్రబోస్, జేడీ స్వామి, ప్రాచీ థాకర్

థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో 'పర్‌ఫ్యూమ్'

చేనాగ్, ప్రాచీ థాకర్ జంటగా నటించిన చిత్రం 'పర్‌ఫ్యూమ్'. జేడీ స్వామి దర్శకుడు. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్కార్ అవార్డుగ్రహీత చంద్రబోస్‌ను చిత్ర బృందం ఘనంగా సన్మానించింది. దర్శకుడు మాట్లాడుతూ 'సరికొత్త పాయింట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. స్మెల్ బేస్డ్ థ్రిల్లింగ్ కాన్సెప్ట్ ఇది. ఇప్పటివరకు తెలుగు తెరపై ఇలాంటి కథ రాలేదు' అన్నారు. స్మెల్లింగ్ అబ్‌సెషన్ అనే కాన్సెప్ట్‌తో రూపొందించిన తొలి చిత్రమిదని, కథలోని మలుపులు ఉత్కంఠకు గురిచేస్తాయని, తన పాత్ర నెగెటివ్ ఛాయలతో సాగుతుందని హీరో చేనాగ్ తెలిపారు. ఈ చిత్రానికి జె.సుధాకర్, శివ బి, రాజీవ్ కుమార్, లావురి శ్రీనివాస్, రాజేంద్ర కనుకుంట్ల, శ్రీధర్ అక్కినేని నిర్మించారు.

రియా చక్రవర్తి

అవకాశాలు రావడం లేదు

బాలీవుడ్ నటుడు సుశాంత్‌సింగ్‌రాజ్‌పుత్ ఆత్మహత్య ఉదంతం యావత్ దేశాన్ని కలచివేసింది. ఈ కేసులో సుశాంత్ ప్రియురాలు రియా చక్రవర్తి విచారణను ఎదుర్కొంది. ఈ క్రమంలో ఆమె కొంతకాలం పాటు జైలు జీవితాన్ని గడిపి బెయిల్‌పై బయటికొచ్చింది. సుశాంత్ ఆత్మహత్య విషయంలో రియా చక్రవర్తికి ఎలాంటి సంబంధం లేదని నిర్ధారణ జరిగినప్పటికీ ఇండస్ట్రీలో మాత్రం ఆమెపై వ్యతిరేకత పోవడం లేదు. ఇదే విషయం గురించి రియాచక్రవర్తి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. 'గతంలో మాదిరిగా సోషల్‌మీడియాలో నాపై ట్రోల్స్ రావడం లేదు. చాలా వరకు తగ్గాయి. కానీ ఇండస్ట్రీలో మాత్రం అందరూ అనుమానంగా చూస్తున్నారు. సినిమా అవకాశాలు ఇవ్వడానికి భయపడుతున్నారు. త్వరలో నిజానిజాలేమిటో తెలుసుకుంటారని భావిస్తున్నా' అని చెప్పింది.

జీవితమే పోరాటం

క్యూబా పోరాటయోధుడు చే గువేరా జీవిత కథ ఆధారంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'చే'. 'లాంగ్ లివ్' ఉపశీర్షిక. బీఆర్ సభావత్ నాయక్ టైటిల్ రోల్‌ని పోషిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'తొలిసారి భారతీయ చిత్ర సీమలో రూపొందిస్తున్న చే గువేరా బయోపిక్ ఇది. జీవితమే పోరాటంగా బతికిన చే గువేరా చరిత్రను కళ్లకుకట్టినట్లుగా ఈ సినిమాలో చూపించబోతున్నాం. డిసెంబర్ తొలివారంలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. లావణ్య సమీరా, పూల సిద్ధేశ్వర్, కార్తీక్ నూనె తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కల్యాణ్‌సమి, జగదీష్, సంగీతం: రవిశంకర్, రచన–దర్శకత్వం: బి.ఆర్.సభావత్ నాయక్.

అలియాభట్